
సాక్షి ఒడిశా

శుక్రవారం । 30 । మే । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.8,83,986లు, బంగారం 4 గ్రాముల 150 మిల్లీగ్రాములు, వెండి 18 గ్రాముల 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



లక్షపతి దీదీ ప్రోత్సాహం

భువనేశ్వర్‌లో లక్షపతి దీదీ జాతీయ సమావేశం జరిగింది. సీఎం ప్రసంగించారు.

- 8లో



విజిలెన్స్ వలలో అకౌంటెంట్

పర్లాకిమిడిలో ఓ అకౌంటెంట్ విజిలెన్స్ వలలో పడ్డాడు. మరో కోశాధికారి కూడా దొరికాడు.

- 8లో

న్యూస్‌రీల్

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీ సారిసోపాదొరో గ్రామంలో ఒక నీటి మోటార్ చోరీ కేసుకు సంబంధించి పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి సారిసోపాదొరో గ్రామానికి చెందిన సంజీవ్ కుమార్‌గా గుర్తించారు. ఈ మేరకు పోలీసులు నిందితుడిని గురువారం కోర్టుకు తరలించారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం... రెండు రోజుల క్రితం సారిసోపాదొరో గ్రామంలో తాగునీటికి సంబంధించిన మోటార్ చోరీకి గురయ్యింది. ఈ మేరకు గ్రామస్తులు టికిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేసి చర్యలు తీసుకున్నారు.

చెరువులో మునిగి బాలుడు మృతి



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి సాలిమ్ పంచాయతీ బారుబేడ గ్రామంలో గురువారం ఉదయం రాజబీర్ పూజారి అనే నాలుగేళ్ల బాలుడు చెరువులో స్నానానికి వెళ్లి మునిగిపోయి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ఇంటి పనుల్లో ఉన్నటువంటి తల్లి తన కుమారుడు తోటి పిల్లలతో ఆడుకొని ఉంటాడని అనుకుంది. అయితే ఉదయం 10 గంటల సమయంలో బాలుడి కోసం ఎంత వెదికినా కనిపించలేదు. గ్రామంలో అందరినీ అడిగినా ఎవరూ చూడలేదని చెప్పడంతో అంతటా వెదికారు. ఆ సమయంలో అటుగా వచ్చిన స్థానికులు బాలుడి చెప్పులు చూసి అనుమానంతో చెరువులో దిగి చూస్తే ఒక మూలాన బాలుడి మృతదేహం లభ్యమైంది. వెంటనే సాలీమ్ పంచాయతీ సర్పంచ్ చెరువు వద్దకు వెళ్లి అవుట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ సదాశివ పూజారి ఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. బాలుడి మృతితో తల్లి కన్నీరుమున్నీరు అవుతోంది.

శ్రీ జగన్నాథుని దర్శించుకున్న కేంద్ర మంత్రి



భువనేశ్వర్ కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కుటుంబీకులతో కలిసి శ్రీ జగన్నాథుడిని దర్శించుకున్నారు. రాష్ట్ర పర్యటన సందర్భంగా గురువారం ఆయన పూరీ శ్రీ మందిరం సందర్శించారు. ఆయనతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్ పాల్గొన్నారు.

దేశానికి ఒడిశా ఆదర్శం

- కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్
- వికసిత్ కృషి సంకల్ప్ ప్రచార కార్యక్రమం ప్రారంభం
- ఆర్థిక ప్రధాన స్రవంతిలోకి రైతులు: ముఖ్యమంత్రి

భువనేశ్వర్:

భారత రైతులను ఆర్థిక ప్రధాన స్రవంతితో విలీనం చేయడం భారత ప్రభుత్వం లక్ష్యమని, ఈ లక్ష్యం సాధించేందుకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ జాతీయ చైతన్య కార్యక్రమం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ రూపొందించిందని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. పూరీ సాక్షి గోపాల్‌లోని కృషి విజ్ఞాన కేంద్రం నుంచి ఈ జాతీయ ప్రచార కార్యక్రమం గురువారం ప్రారంభించారు. కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏక్ పేడ్ మా కే నామ్ ప్రచారం కింద అతిథులు మొక్కలు నాటారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ ప్రచార కార్యక్రమం దేశ వ్యాప్తంగా 15 రోజుల పాటు నిరవధికంగా కొనసాగుతుంది. ఈ ప్రచారంలో దాదాపు ఒకటిన్నర కోట్ల మంది రైతులతో ప్రభుత్వం ప్రత్యక్షంగా స్పందిస్తుంది. కొత్త వ్యవసాయ పరిజ్ఞానం, అధునాతన సాంకేతికతలపై రైతులకు అవగాహన కల్పిస్తుంది. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి మాట్లాడుతూ జూన్ 12 వరకు కొనసాగే వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ ఆధునిక సాంకేతికతలు, కొత్త విత్తన రకాల గురించి రైతులకు అవగాహన కల్పిస్తుందన్నారు. ఈ ప్రచారం దేశ వ్యాప్తంగా 700 జిల్లాల్లోని సుమారు ఒకటిన్నర కోట్ల మంది రైతులను ప్రభుత్వం చేరుకుని, కొత్త వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాల అనువర్తనం గురించి అవగాహన కల్పిస్తుందన్నారు.

ప్రతి జిల్లా స్థాయిలో 3 బృందాలు ఈ కార్యక్రమాన్ని ముందుకు నడిపిస్తాయి. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయం, ఉద్యానవన విభాగ అధికారులు నేల సంరక్షణకు సంబంధించిన అంశాలను గ్రామీణ రైతులకు సంయుక్తంగా వివరిస్తారు. ప్రతి బృందం రోజుకు 2 గ్రామాల చొప్పున సందర్శిస్తుంది. ఒక్కో గ్రామంలో నిత్యం 250 మంది రైతులను కలుసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు సంక్షేమ పథకాలను వివరిస్తుంది. వివిధ కార్యక్రమాలు, చొరవలు మరియు కొత్త సాగు పరిజ్ఞానం మరియు నైపుణ్యాల ఆచరణాత్మక అంశాలపై రైతులతో చర్చిస్తుంది. పరిశోధన ఆధారిత వ్యవసాయ సమాచారం రైతులకు చేరేలా చర్యలు తీసుకుంటారు. భూసార పరీక్ష, భూసార కార్డుల వినియోగం, ఎరువుల నిర్వహణ, వాతావరణాన్ని తట్టుకునే వ్యవసాయం మొదలైన వాటిపై రైతులకు అవగాహన కల్పించడం ఈ ప్రచార కార్యక్రమం బృహత్తర లక్ష్యంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని వరి రైతులకు మెరుగైన ధరలు అందించి ఆర్థిక ప్రధాన స్రవంతిలో చేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ చారిత్రాత్మక చర్యలు తీసుకుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో రైతాంగం కోసం తరచు కొత్త పథకాలు అందుబాటులోకి తీసుకుని వచ్చి రైతుల సంక్షేమాని పెద్ద పీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ ఒడిశా నేడు సమగ్ర భారతదేశానికి ఒక ఉదాహరణగా నిలిచిందని అభినందించారు. సమృద్ధ్ కిసాన్ యోజన అమలు చేసి రైతాంగం ఆర్థిక బలోపేతానికి నాంది పలికారని పేర్కొన్నారు. ఈ పథకం కింద ప్రభుత్వం రైతుల నుంచి క్వింటాలుకు రూ. 3,100 చొప్పున వరిని కొనుగోలు చేస్తోంది. ఇది కనీస మద్దతు ధర కంటే రూ. 800 అధికం కావడం విశేషం. ఈ చర్యతో రైతు ఆదాయం పెరిగి దేశ సమగ్ర ఆర్థిక పురోగతికి పునాది వేస్తుందన్నారు.

మరో వైపు రాష్ట్రంలోని చాలా మంది మహిళలు నేడు సుభద్ర వంటి పథకాల వల్ల ప్రయోజనం పొందుతున్నారు. మహిళా సాధికారత, వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధి, రైతాంగం సాధికారిత వంటి కార్యక్రమాలతో ఒడిశా యావతు ప్రపంచానికి ఒక ఉదాహరణగా నిలుస్తుందని తాము విశ్వసిస్తున్నామని కేంద్ర వ్యవసాయ మంత్రి ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి, వ్యవసాయ-రైతు సాధికారత విభాగం మంత్రి కనక్ వర్ధన్ సింగ్ దేవ్ మాట్లాడుతూ వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ రైతులను యాంత్రికంగా శక్తివంతం చేయడానికి ఒక ప్రత్యేక మార్గమని అన్నారు. ఈ ప్రచారం ఒడిశా నుంచి ప్రారంభం కావడం ఆనందకరమన్నారు. కార్యక్రమంలో పిప్పిలి నియోజక వర్గం ఎమ్మెల్యే అశ్రిత్ పటానాయక్, సత్యబాది నియోజక వర్గం ఎమ్మెల్యే ఓం ప్రకాష్ మిశ్రా, బ్రహ్మగిరి నియోజక వర్గం ఎమ్మెల్యే ఉపాసన మహాపాత్రో, వ్యవసాయ, రైతు సాధికారత శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ అరవింద్ కుమార్ పాఢి, ఓయూఏటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పార్వతి కుమార్ రావల్, భారత ప్రభుత్వ వ్యవసాయ పరిశోధన, విద్యా శాఖ కార్యదర్శి, భారత వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ డాక్టర్ మంగీలాల్ జాట్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ శుభం సక్సేనా తదితరులు పాల్గొన్నారు.



వికసిత్ కృషి సంకల్ప్ ప్రచార కార్యక్రమం ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



ఏక్ పేడ్ మా కే నామ్ ప్రచారం కింద మొక్క నాటిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



జాతీయ ప్రచార కార్యక్రమం ప్రారంభోత్సవంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రసంగం



వికసిత్ కృషి సంకల్ప్ ప్రచార కార్యక్రమం ప్రారంభంలో రాష్ట్ర ముఖ్యమంత్రితో కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రులు

కొరాపుట్-కొత్తవలస రైల్వే మార్గం పునరుద్ధరణ

కొరాపుట్: కొరాపుట్-కొత్తవలస రైల్వే మార్గంలో పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. గురువారం రాత్రికి పట్టాలు తప్పిన 37 బోగీల్లో 32 బోగీలు పట్టాలు ఎక్కించారు. టన్నెల్‌లో ఉన్న మిగతా బోగీలు క్రమబద్ధీకరించడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఈ మార్గంలో అన్ని రైల్వే సర్వీసులు రాయగడ మీదుగా కొరాపుట్ వైపు వెళ్తున్నాయి. కానీ విశాఖ-కిరండోల్ ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లని పూర్తిగా రద్దు చేశారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కిరండోల్ నుంచి ముడి ఇనుప రజనుతో మూడు ఇంజిన్ల గూడ్స్ రైలు విశాఖ వస్తుండగా అరకు సమీపంలో పట్టాలు తప్పింది. ఇప్పటికే వాల్తేర్ డీఆర్‌ఎం లలిత్ బోరా, రాయగడ డీఆర్‌ఎం అమితాబ్ అమితాబ్ సింఘాల్ పునరుద్ధరణ చర్యలు పర్యవేక్షిస్తున్నారు. విశాఖ పట్నం, రాయగడ, కొరాపుట్, పలాస, కొత్తవలస, విజయ నగరం నుంచి రైల్వే సిబ్బంది వచ్చి పనుల్లో నిమగ్నమయ్యారు. టన్నెల్‌లో చిక్కుకుండిపోవడంతో పాటు, వర్షాల వల్ల పనులకు ఆటంకం కలుగుతోంది. 2024 ఫిబ్రవరి నుంచి నేటి వరకు సుమారు 7 సార్లు రైళ్లు పట్టాలు తప్పాయి. పట్టాలు ఎక్కిన కొన్ని బోగిలను చిమిడి పల్లి స్టేషన్ వద్దకు తెచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్ 22నే రైల్వే భద్రతా సేఫ్టీ కమిషనర్ బ్రజేష్ కుమార్ మిశ్ర ఈ మార్గంలో పర్యటించారు.



సహాయక చర్యలు జరుగుతున్న దృశ్యం



సొరంగంలో నిలిచి పోయిన రైలు



పట్టాలు తప్పిన రైలు చక్రాలు



పనిలో నిమగ్నమైన సిబ్బంది



భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న రైల్వే పోలీసులు

విజిలెన్స్ వలలో సీనియర్ ఇంజినీర్



ప్రజారోగ్య శాఖ కార్యాలయం



సహదేవ్ కిషాన్

రాయగడ: స్థానిక సిరిగుడ సమీపంలోని ప్రజా ఆరోగ్య శాఖలో సీనియర్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న సహదేవ్ కిషాన్ విజిలెన్స్ వలలో చిక్కుకున్నారు. అతని నుంచి రూ.1.50 లక్షల నగదును విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి అందిన వివరాల ప్రకారం... ప్రజారోగ్య శాఖ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకొని కార్యాలయం నుంచి తన వాహనంలో ఇంటికి వెళ్తున్న సమయంలో విజిలెన్స్ అధికారులు వెంబడించారు. అనంతరం ఆయన గృహంలో అతనిని పట్టుకుని నగదు స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి సరైన ఆధారాలు చూపకపోవడంతో అరెస్టు చేశారు. అలాగే సహదేవ్‌కు సంబంధించి మరో రెండు ప్రాంతాల్లో దాడులు చేపట్టారు.




స్వాధీనం చేసుకున్న నగదు

హోంగార్డ్స్ శరీర సౌష్టవ పరీక్షల్లో విషాదం



అస్వస్థతకు గురైన వారిని ప్రభుత్వాస్పత్రిలో చేర్చి చికిత్స చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది



రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝి ఎక్స్‌లో పోస్టుచేసిన నష్టపరిహారం

పర్లాకిమిడి:

స్థానిక బెత్తగుడ పోలీసు బ్యారక్‌లో గురువారం ఉదయం హోంగార్డు పోస్టులకు శరీర సౌష్టవం పరీక్షలు నిర్వహించారు. అందులో భాగంగా రెండు కిలోమీటర్ల పరుగుల పోటీలో తొలుత మహిళా అభ్యర్థులు అనంతరం పురుషులు పాల్గొన్నారు. వీరిలో ఐదుగురు అస్వస్థతకు గురికాగా, ఒక అభ్యర్థి ఆర్.ఉదయగిరి బ్లాక్, రామగిరి పంచాయతీ పరిసల గ్రామానికి చెందిన సులంతా మిశాల్ (25) తీవ్ర అస్వస్థతకు గురై గ్రౌండ్‌లోనే పడిపోయాడు. వెంటనే ఎస్పీ ఎస్పీ జ్యోతీంద్రనాథ్ పండా ఆదేశాల మేరకు అతడిని జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. జిల్లాలోని 144 హోంగార్డుల పోస్టులకు గత రెండునెలల నుంచి ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. ఈ హోంగార్డు పోస్టులకు 1200 మంది అభ్యర్థులు ఈరోజు పోటీ పడుతున్నారు.





సులంతా మిశాల్ (రామగిరి) మృతదేహం (ఇన్‌సెట్లో) సులంతా మిశాల్ (ఫైల్)

సీఎం ప్రగాఢ సంతాపం

మృతుడు సులంతా మిశాల్ మృత్యువార్త తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, కోడూరు నారాయణ రావు భువనేశ్వర్‌లో సీపీఎం మోహన్ చరణ్ మాఝికి ఈ విషయం తెలియజేశారు. సీఎం మిశాల్ కుటుంబానికి సంతాపం తెలిపి, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.4 లక్షలు నష్టపరిహారం ప్రకటిస్తున్నట్టు ఎక్స్‌లో పోస్టుచేశారు.

వడివడిగా రథాల తయారీ





శ్రీజగన్నాథుని రథయాత్ర దగ్గర పడుతోంది. రథాల తయారీ పనులు వడివడిగా సాగుతున్నాయి. నైరుతి రుతు పవనాల రాకతో తరచూ వాన జల్లులు కురుస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు ఎండ వేడిమిని ఎదుర్కొన్న రథ చక్రాలు, ఇతర భాగాలు వాన జల్లులతో సంకోచ వ్యాకోచ ప్రభావంతో దెబ్బతినకుండా కొబ్బరి ఆకులతో కప్పి రక్షణ కల్పిస్తున్నారు. రథాల తయారీలో ప్రతీచర్య కీలకమే.

- భువనేశ్వర్/పూరీ

క్లుప్తంగా

కోణార్క్ సూర్య దేవాలయం జలమయం



జలమయం కోణార్కు ఆలయం.

భువనేశ్వర్: అల్పపీడనం కారణంగా నిరంతరం వర్షం కురుస్తోంది. తెరిపి లేని వర్షాలతో కోణార్క్ సూర్య దేవాలయం జలమయమైంది. దీంతో పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు.

మెళియాపుట్టి క్రీడాకారుడికి గోల్డ్‌మెడల్

మెళియాపుట్టి : మండల కేంద్రం మెళియాపుట్టికి చెందిన పొట్నూరు అనిరుథ్ రోల్‌బాల్ (స్కేటింగ్)లో సత్తాచాటాడు. ఇటీవల జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటడంతో శ్రీలంక దేశంలోని మినువాంగోడలో జరుగుతున్న అంతర్జాతీయ పోటీలకు అవకాశం కలిగింది. గురువారం జరిగిన పోటీల్లో భారత్ తరపున బంగారు పతకం సాధించాడు. అనిరుద్ధ్‌కు తల్లిదండ్రులు నవీన్‌కుమార్, మీనాక్షి, గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

సారవకోట : వాండ్రాయి గ్రామానికి చెందిన రాడ పార్వతమ్మ (59) అనారోగ్యంతో బుధవారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది.భర్త ఆనందరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ఆస్పత్రికి తరలించారు. పార్వతమ్మకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

రణస్థలం: పాతర్లపల్లి పంచాయతీలోని వెంకటేశ్వర కాలనీలో రేగాన ఉత్తరమ్మ ఇంట్లో ఈ నెల 25న బంగారం వస్తువులు చోరీకి గురయ్యాయని జె.ఆర్.పురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు అదే ఇంట్లో ఉన్న శైలు, అతని ప్రియుడు డి.దుర్గా ప్రసాద్‌లే దొంగతనం చేసినట్లు గుర్తించి అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు. నిందితులకు వచ్చే నెల 11 వరకు కోర్టు రిమాండ్ విధించిందని చెప్పారు. బంగారాన్ని రికవరీ చేశామని తెలిపారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో ప్రతిభ



సిల్వర్‌మెడల్ సాధించిన శివకుమార్

కాశీబుగ్గ: అండమాన్ నికోబార్ దీవుల్లోని ల్యాండ్ పోర్టుబ్లెయిర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో పలాస-కాశీబుగ్గకు చెందిన ఎం.శివకుమార్ సత్తాచాటాడు. మిస్టర్ అండమాన్ హంట్ విభాగంలో 170 కేటగిరీలో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా విజేతలను సిల్వర్ మెడల్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా జంటపట్టణాల బాడీబిల్డర్స్ గురువారం అభినందనలు తెలిపారు.

హెచ్‌ఎంలకు బదిలీ ఉత్తర్వులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ సాధారణ బదిలీల్లో భాగంగా గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తయింది. ఆప్షన్ ప్రకారం ఎంచుకున్న స్కూళ్లకు బదిలీ చేస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులు అందుకున్న హెచ్‌ఎంలు విధుల్లో చేరాలని డీఈఓ తిరుమల చైతన్య ఆదేశించారు.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని మంగువారితోట లెప్రసీ కాలనీ వద్ద మత్తులో ఉన్న యువకులు ఓ హెడ్‌కానిస్టేబుల్‌పై దాడి చేశారు. వారు గంజాయి మత్తులో ఉన్నారా.. లేదంటే మద్యం మత్తులోనే దాడికి పాల్పడ్డారా అన్నది తెలియాల్సి ఉంది. శ్రీకాకుళం ఒకటో పట్టణ ఏఎస్‌ఐ రాంబాబు, స్థానికులు చెప్పిన వివరాల మేరకు.. జిల్లా క్రైమ్ రికార్డ్ బ్యూరో (డీసీఆర్బీ) విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న త్రినాథ్ గురువారం రాత్రి విధులు ముగించుకుని లెప్రసీ కాలనీలో ఉన్న తన ఇంటికి బయల్దేరాడు. మంగువారి తోట వద్ద కాలనీలో వెళ్తుండగా నలుగురు యువకులు మత్తులో రోడ్డుపై న్యూసెన్సు చేస్తున్నారు. ఈ క్రమంలో బండిపై వెళ్తున్న హెచ్‌సీ త్రినాథ్‌కు ఓ యువకుడి చేయి తగలడంతో 'ఈ సమయంలో ఇలా చేస్తున్నారేంటి' అని ప్రశ్నించారు. దీంతో నలుగురు యువకులు హెచ్‌సీతో వాగ్వాదానికి దిగారు. ఒక్కసారిగా దాడికి ఎగబడ్డారు. ఈ పరిణామం నుంచి తేరుకునేలోపే హెచ్‌సీకి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఒకటో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. గాయపడిన త్రినాథ్‌ను రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎంఎల్‌సీ అయ్యిందని రిమ్స్ ఔట్‌పోస్ట్ అధికారులు నిర్ధారించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మహిళల్లో నాయకత్వ ప్రేరణకు

లక్షపతి దీదీ ప్రోత్సాహం: సీఎం



లక్షపతి దీదీ కాఫీ టేబుల్ పుస్తకం ఆవిష్కరణ

- జాతీయ లక్షపతి దీదీ సమావేశం
- 2025- 25 రాష్ట్రాల నుంచి లక్షపతి దీదీలు హాజరు
- అగ్రస్థానంలో నయాగఢ్ జిల్లా

భువనేశ్వర్: భారత ప్రభుత్వం ఆవిష్కరించిన లక్షపతి దీదీ యోజన మహిళల ఉనికిని కొత్త ఒరవడి దిద్దిందని, ప్రధానంగా గ్రామీణ మహిళల్లో నాయకత్వ లక్షణాల్ని ప్రేరేపించడంలో ఈ చొరవ కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. ఈ పథకం కింద మహిళలు ఏటా రూ. 1 లక్షకు పైగా సంపాదించడానికి మార్గం సుగమం చేసిందని, ఉపాధి కల్పనతో ఆర్థిక సాధికారితకు పరిమితం కాకుండా వారిలో నాయకత్వ భావాల్ని ప్రేరేపించడం లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. స్థానిక లోక్ సేవా భవన్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం మిషన్ శక్తి విభాగం నిర్వహించిన జాతీయ లక్షపతి దీదీ సమావేశం – 2025 సందర్భంగా ఆయన ప్రసంగించారు. ఈ సమావేశానికి దేశంలోని 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి లక్షపతి దీదీలు, ప్రభుత్వ అధికారులు హాజరయ్యారు. రాజకీయ రంగంలో మహిళల ప్రాతినిధ్యం కోసం నారీ శక్తి బంధన్ చట్టం పార్లమెంటులో ఆమోదం పొందిందని, దీని ద్వారా భావి ఎన్నికలలో కనీసం 33 శాతం మహిళలు లోక్ సభ మరియు రాష్ట్ర శాసన సభకు ఎన్నికవుతారని ఆయన అన్నారు. లక్షపతి దీదీ మిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో అమలు చేసిందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యాచరణతో సుమారు 17 లక్షల మంది మహిళలను లక్షాధికారులను చేశామని, ఈ సాఫల్యం జాతీయ స్థాయిలో రాష్ట్రానికి అగ్ర స్థానాన్ని కల్పించిందని అన్నారు. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలు, మిషన్ శక్తి, ఒడిశా జీవనోపాధి మిషన్ నిజాయితీచ అట్టడుగు స్థాయిలో సమర్థమైన కృషి ఫలితంగా ఈ విజయాన్ని సాధించామన్నారు.

'రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో మహిళలకు రూ. 10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నారు. రివాల్వింగ్ ఫండ్ సహాయం రూ.15,000 నుండి రూ.30,000 కు పెంచారు. కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌ను రూ. 35 లక్షల నుంచి రూ. 60 లక్షలకు పెంచారు. ఈ చర్యతో మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులు ఆత్మవిశ్వాసంతో తమ వ్యాపారాన్ని సమర్థంగా నిర్వహించి నిరవధికంగా జీవనోపాధిని పొందగలుగుతున్నారు. సుభద్ర శక్తి మేళా మద్దతుతో సుభద్ర శక్తి కేఫ్ మహిళలకు కొత్త జీవనోపాధి నమూనాగా ప్రారంభమైంది. మహిళల దృఢ సంకల్పం మరియు కృషితో వ్యాపారం ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నాయ'ని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సందర్భంగా రాయగడ జిల్లాకు చెందిన లక్షపతి దీదీ వింధ్యవాసిని, మహారాష్ట్రకు చెందిన శోభ దిగంబర కదమ్ తమ అనుభవాలు, సాఫల్యతనకు సభాముఖంగా పంచుకున్నారు.

దేవ్‌గఢ్ జిల్లాకు చెందిన శకుంతల ధొలొ, గజపతి జిల్లాకు చెందిన సులా మి దాల్‌బెహెరా, కేంద్రపడా జిల్లాకు చెందిన మమతా నాథ్ శర్మలను ఉత్తమ లక్షపతి దీదీలుగా ఎంపిక చేసి ముఖ్యమంత్రి బహుమతులు ప్రదానం చేశారు. 98 శాతం లక్షపతి దీదీల ఆవిష్కరణతో రాష్ట్ర స్థాయిలో నయాగఢ్ జిల్లా అగ్ర స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో కేంద్రాపడా, కటక్, భద్రక్, జగత్‌సింగ్‌పూర్ జిల్లాలు ద్వితీయ స్థానంలో నిలిచాయి. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అధికారిగా ఒడిశా జీవనోపాధి మిషన్ అధికారి దేవి ప్రసాద్ నాయక్‌ను ముఖ్యమంత్రి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి లక్షపతి దీదీ పథకం సాఫల్యత వీడియో, కాఫీ టేబుల్ పుస్తకం మరియు బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, స్త్రీ, శిశు అభివృద్ధి విభాగం మంత్రి ప్రభాతి పరిడా తన ప్రసంగంలో లక్షపతి దీదీ యోజన ఒక ఉద్యమంగా పేర్కొన్నారు. లక్షపతి దీదీల ఆవిష్కరణలో ఒడిశా నిరంతరం అగ్ర స్థానంలో కొనసాగుతుంది. ఈ పథకం ప్రోత్సాహంతో వ్యవసాయం, పశుపోషణ, కుట్టుపని, కేఫ్‌లు వంటి అన్ని రంగాలలో రాష్ట్ర గ్రామీణ మహిళలు తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారని అన్నారు. అభివృద్ధి ప్రక్రియలో మహిళలను భాగస్వామ్యం చేయడానికి ప్రభుత్వం ప్రాముఖ్యత కల్పిస్తుందని రాష్ట్ర అభివృద్ధి కమిషనర్, అదనపు ప్రధాన కార్యదర్శి అనూ గర్గ్ అన్నారు. మిషన్ ఎనర్జీ డిపార్ట్‌మెంట్ కమిషనర్, అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ షాలిని పండిట్, డైరెక్టర్ డాక్టర్ మోనికా ప్రియదర్శిని ఈ కార్యక్రమంలో ధన్యవాదాలను ప్రతిపాదించారు.



మేటి లక్షపతి దీదీలతో ముఖ్యమంత్రి తదితర ప్రముఖులు



జాతీయ లక్షపతి దీదీ సమావేశం - 2025కి హాజరైన జాతీయ ప్రతినిధులు

ప్రభుత్వ ఉద్యోగాల గరిష్ట వయో పరిమితి పెంపు

భువనేశ్వర్:

ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో 5 ప్రతిపాదనలు ఆమోదం పొందాయి. ప్రభుత్వ ఉద్యోగంలో ప్రవేశించడానికి గరిష్ట వయోపరిమితిని 32 నుంచి 42 ఏళ్లకు పెంచే ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. వివిధ నియామక పరీక్షలలో పాల్గొనడానికి అభ్యర్థులకు తగినంత అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించిన మేరకు గరిష్ట వయోపరిమితిని 32 నుంచి 42 ఏళ్లకు పెంచాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. ఉద్యోగ భర్తీ పురస్కరించుకుని నిర్దిష్ట వయోపరిమితి సూచిస్తే ఈ పెంపు వర్తించదు. పోలీసు, అగ్నిమాపక సేవలు, అబ్కారి సేవలు మొదలైన యూనిఫామ్ నియామక నియమాల్లో శారీరక సామర్థ్య పరీక్ష సూచించన సందర్భాల్లో వర్తించదు. ఎప్పటికప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా షెడ్యూల్డు కులాలు, తెగలు, ఎస్ఈబీసీ, మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికులు విషయంలో పైన పేర్కొన్న గరిష్ట వయో పరిమితి మరింత సడలింపును కలిగి ఉంటుందని పేర్కొన్నారు.



ముఖ్యమంత్రి అధ్యక్షతన మంత్రి మండలి సమావేశం

కృత్రిమ మేధస్సు (ఏఐ) విధానం – 2025 మంత్రి మండలి ఆమోదించింది. దీంతో రాష్ట్రంలో ఏఐ మిషన్, ఏఐ సెల్ ప్రారంభిస్తారు. ఈ రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహిస్తారు. పాలనను మెరుగుపరచడానికి, ఆవిష్కరణలను ప్రేరేపించడానికి, డేటా ఆధారిత నిర్ణయం మెరుగుదల, సామాజిక, ఆర్థిక అభివృద్ధి ప్రోత్సాహానికి కృత్రిమ మేధస్సు సామర్థ్యం ఉపయోగించుకునే దిశలో ఇదో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఢెంకనాల్ జిల్లా జొరండా ప్రాంతంలో మహిమా గద్దె ప్రాంగణం అభివృద్ధి పనులు, శూన్య మండపం నిర్మాణానికి ఆమోదం తెలిపారు. 36 నెలల్లోపు ఈ పనులు పూర్తి చేయాలని మంత్రి మండలి ఆదేశించింది. జగత్‌సింగ్‌పూర్‌లోని జేఎస్‌డబ్ల్యూ తన సొంత జెట్టీని నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మరియు జేఎస్‌డబ్ల్యూ మధ్య కుదిరిన ఒప్పందాన్ని మంత్రివర్గం ఆమోదించింది. ఈ చర్యతో రాష్ట్రంలో 3,450 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అందుబాటులోకి వస్తుంది. ఒడిశా నేత్ర సంరక్షణ సేవల కోసం 141 కొత్త పోస్టుల సృష్టి, 200 పోస్టుల అప్‌గ్రేడ్ ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోద ముద్ర వేసింది.

జిల్లా కేంద్రాస్పత్రిలో బాలింత మృతి

జయపురం: జయపురం పూల్‌బెడ ప్రాంతంలో గల కొరాపుట్ జిల్లా కేంద్రాస్పత్రిలో ఒక బాలింత గురువారం సాయంత్రం మృతి చెందింది. డాక్టర్ల నిర్లక్ష్యం వల్లనే ఆమె చనిపోయిందని మృతురాలి బంధువులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. సదర్ పోలీసు అధికారులు వచ్చి ఆందోళన కారులను శాంత పరచారు. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ హనుమాన్ నగర్ ప్రాంతానికి చెందిన పూర్ణిమ బాగ్ నిండు గర్భిణి. ఆమెను బంధువులు బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్చారు. మెరుగైన వైద్యం కోసం ఆమెను జయపురం పూల్‌బెడలో గల జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని డాక్టర్లు వెల్లడించారు. అయితే అకస్మాత్తుగా పూర్ణిమ ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. ఆమె బీపీ పెరగటంతో పాటు ఆమె శ్వాస తీయటం కష్టంగా మారింది. వెంటనే బంధువులు డాక్టర్‌ను పిలవమని నర్సుకు తెలిపారు. కానీ డాక్టర్ రావడం ఆలస్యం చేశారు. సకాలంలో వైద్యం అందకపోవడం వల్లనే పూర్ణిమ చనిపోయిందని భర్త విజయ సాగరిక ఆరోపించారు. బంధువులు, గ్రామస్తులు ఆస్పత్రికి చేరుకుని ఆందోళన చేశారు. డాక్టర్‌ను పిలిపించి వాస్తవం తెలుసుకొని సముచిత నిర్ణయం తీసుకుంటామని హామీ ఈయటంతో పూర్ణిమ మృత దేహాన్ని తీసుకు వెళ్లారని సదర్ పోలీసు అధికారి సచీంద్ర ప్రధాన్ వెల్లడించారు.



పూర్ణిమ మృతదేహం



ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

- ఇద్దరికి గాయాలు

రాయగడ:

జిల్లాలోని రామనగుడ సమితి పరికిత్తి ఘాట్ రోడ్డు మలుపులో గురువారం జరిగిన ప్రమాదంలో యువతి మృతి చెందింది. మరో ఇద్దరు గాయాల పాలయ్యారు. మృతి చెందిన యువతి రుగుడుబాయి గ్రామానికి చెందిన పూర్ణిమ మండంగి (20)గా గుర్తించారు. గాయాల పాలైన వారు అదే గ్రామానికి చెందిన పాపిని మండంగి, శివ మండంగిగా సమాచారం. పూర్ణిమ, పాపిని, శివ స్కూటీపై రామనగుడ వెళ్తున్నారు.

పరికిత్తి ఘాటీ మలుపు వద్ద వెనుక నుంచి లారీ వచ్చి స్కూటీని బలంగా ఢీకొంది. స్కూటీపై ఉన్న ముగ్గురు కొద్ది దూరం ఎగిరిపడ్డారు. ఈ ప్రమాదంలో పూర్ణిమ మండంగికి తీవ్రగాయాలు తగిలి సంఘటన స్థలం వద్దే మృతి చెందింది. గాయాల పాలైన ఇద్దరిని రామనగుడ ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని గ్రామస్తులు రహదారిపై ఆందోళన చేపట్టారు. దీంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న రామనగుడ పోలీస్ స్టేషన్ ఐఐసీ సునితా బెహెర, గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహాట సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులను బుజ్జగించే ప్రయత్నం చేశారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని సబ్ కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



ప్రమాదానికి కారణమైన లారీని అడ్డగించిన గ్రామస్తులు



ప్రమాద స్థలంలో పూర్ణిమ మృతదేహం

టోల్‌గేటు వద్ద ఉద్రిక్తత



అదనపు లోడ్ లేకపోవడంతో పోలీసుల సమక్షంలో విడిచిపెట్టిన లారీ

కాశీబుగ్గ: పలాస మండలం లక్ష్మీపురం టోల్‌గేటులో పోలీసులతో కలిసి సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని రాష్ట్ర లారీ ఓనర్ల అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు. వారంతా కలిసి గురువా రం నిరసన కార్యక్రమం నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. వివరాల్లోకి వెళ్తే.. పలాస మండలం లక్ష్మీపురం జాతీయ రహదారి టోల్‌గేటు వద్దకు బుధవారం కాకినాడకు చెందిన లారీ వచ్చింది. లారీ ఓవర్ లోడుతో ఉందని, అదనంగా డబ్బులు కట్టాలని టోల్ సిబ్బంది కోరగా.. ఏ టోల్‌ప్లాజాలో లేని ఓవర్ లోడ్ లక్ష్మీపురం టోల్‌ప్లాజాలో ఎలా ఉందని డ్రైవర్ రమేష్ లంకా ప్రశ్నించారు. దీంతో అదనంగా చెల్లిస్తేనే విడిచిపెడతామని లేకుంటే విడిచిపెట్టబోమని వాహనాన్ని అడ్డుకున్నారు. అదనంగా ఉంటే అపరాధ రుసుం చెల్లిస్తామని డ్రైవర్ చెప్పినా వినకుండా డ్రైవర్‌పైకి కొట్టడానికి వెళ్లడంతో ఆయన 112కు కాల్ చేసి పోలీసుల సహకారం కోరారు. కాశీబుగ్గ పోలీసులు సైతం డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నారని స్టేషన్‌కు తీసుకుని వెళ్లారు. కానీ పరీక్షల్లో తాగలేదని తేలడంతో విడిచిపెట్టి టోల్‌ప్లాజా వద్ద గొడవ చేశారని పోలీసులు రూ.1030 అపరాధ రుసుం కట్టించుకున్నారు. దీనిపై డ్రైవర్ స్పందిస్తూ తన తప్పు లేకున్నా టోల్‌గేటు సిబ్బంది అదనంగా డబ్బులు అడుగుతున్నారని, పోలీసులను సంప్రదిస్తే వారు కూడా టోల్ సిబ్బందికే సహకరించారని తెలిపారు. దీనిపై అసోసియేషన్ సభ్యులకు సమాచారం అందించడంతో గురువారం ఉదయం లక్ష్మీపురం టోల్‌ప్లాజా వద్దకు వందలాది లారీలకు సంబంధించిన వివిధ అసోసియేషన్ సభ్యులు చేరుకున్నారు. టోల్‌ప్లాజాలో డిస్‌ప్లే లేకుండా అదనపు బరువు చెబుతూ అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారని, ఇవ్వని వారిపై దాడి చేయడానికి వస్తున్నారని, బరువు తూయకుండా అదనపు లోడ్ అని డబ్బులు తీసుకుంటే ఎలా ఇస్తామని ప్రశ్నించారు. మీడియా, కాశీబుగ్గ పోలీసుల సమక్షంలో లారీ బరువు తూయగా అదనపు లోడ్ లేదని తేలడంతో టోల్‌ప్లాజా సిబ్బంది, అధికారులను నిలదీశారు. తక్షణమే విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టి లక్ష్మీపురం టోల్‌ప్లాజా కాంట్రాక్ట్ రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా లారీలు సరుకు రవాణాతో ఉపాధి పొందుతుంటే ఈ ప్రభుత్వం ఇబ్బందులు పెట్టడానికి చూస్తోందని ఆరోపించారు.

ట్రాఫిక్ హోంగార్డ్‌పై ఆటో డ్రైవర్ దాడి

రాయగడ: ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న హోంగార్డుపై ఆటో డ్రైవర్ దాడి చేసి గాయపరిచిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఆటో డ్రైవర్‌పై సదరు పోలీస్ స్టేషన్‌లో హోంగార్డ్ గురువారం ఫిర్యాదు చేశారు. ఈ నెల 26వ తేదీన స్థానిక కపిలాస్ కూడలిలో ట్రాఫిక్ విధులను హోంగార్డు అశోక్ కుమార్ పాడి నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో ఆటో డ్రైవర్ ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించి వస్తున్నాడు. హోంగార్డు ఆటోను ఆపి డ్రైవర్‌ను మందలించాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో హంగార్డుపై ఆటో డ్రైవర్ దాడి చేసి గాయపరిచాడు. అనంతరం అక్కడ నుంచి వెళ్లిపోయాడు. దీనికి సంబంధించి వీడియో వైరల్ అయింది. దీనిపై స్పందించిన పోలీసులు ఆటో నంబర్ ఆధారంగా గాలించారు. ఆటో రాయగడలోని న్యూకాలనీకి చెందినదిగా గుర్తించారు. ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నట్లు ఐఐసీ కేకేబీకే కుహోరో తెలియజేశారు. ఆటోను సీజ్ చేసిన పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఆటో డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.



హోంగార్డుపై దాడి చేస్తున ఆటో డ్రైవర్

భారీగా గంజాయి స్వాధీనం



లారీని పట్టుకున్న పోలీసులు



లారీలో గంజాయి బ్యాగులు

- ఇద్దరి అరెస్టు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో సుమారు కోటి రుపాయల విలువ చేసే గంజాయిని పోలీసులు గురువారం పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఇద్దరిని అరెస్టు చేశారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని అందిన సమాచారం మేరకు పోలీసులు రాయగడ నుంచి గజపతి వైపు వెళ్తున్న లారీని గుణుపూర్ సరిహద్దు వద్ద పట్టుకుని తనిఖీలు నిర్వహించారు. లారీలో పశువుల దాణా 516 బ్యాగుల మధ్య 29 గంజాయి బ్యాగులు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు లారీని సీజ్ చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

గంజాయిని ఇక్కడ నుంచి ఉత్తరప్రదేశ్‌కు రవాణా చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆలీగడ్ జిల్లా నావుస్ గ్రామానికి చెందిన అనిల్ కుమార్, తేకేడర్ గ్రామానికి చెందిన హరీష్ కుమార్‌గా గుర్తించారు. వారి నుంచి రెండు ఫోన్లతోపాటు రూ.7,100 నగదు, రవాణాకు వినియోగించే లారీని సీజ్ చేశారు. నిందితులను కోర్టుకు తరలించారు.

విజిలెన్స్ వలలో అకౌంటెంట్



పర్లాకిమిడిలో చిన్ననీటి పారుదలశాఖ డివిజన్ కార్యాలయం

పర్లాకిమిడి: పర్లాకిమిడిలో చిన్ననీటి పారుదల శాఖ డివిజన్ కార్యాలయంలో గురువారం ఉదయం బరంపురం విజిలెన్సు అధికారులు జరిపిన దాడులలో అకౌంటెంట్ సూరజ్ ప్రసాద్ జైస్వాల్, కోశాధికారి నరేష్ పట్నాయిక్ దొరికిపోయారు. గజపతి జిల్లా గుసాని సమితి గురండి గ్రామానికి చెందిన సరోజ్ పాత్రో అనే కాంట్రాక్టర్ నాలుగు వర్కు బిల్లులు పాస్ చేయడానికి చిన్ననీటి పారుదలశాఖ డివిజన్ అకౌంటెంట్ సూరజ్ ప్రసాద్ జైశ్వాల్, క్యాషియర్ నరేష్ పట్నాయక్‌ను సంప్రదించాడు. అయితే వారు రూ.30వేలు లంచం డిమాండ్ చేసినట్టు కాంట్రాక్టర్ తెలియజేశాడు. దీనిపై విజిలెన్స్ అధికారులను సంప్రదించగా వారు మాటు వేసి పట్టుకున్నారు. తర్వాత వారు నివాసం ఉంటున్న క్వార్టర్స్, ఛెలిగడ (ఆర్.ఉదయగిరి)లో అకౌంటెంట్ జైశ్వాల్ ఇల్లు, బ్యాంకు అకౌంట్లు తనిఖీలు చేశారు.



బరంపురం విజిలెన్స్‌కు చిక్కిన మైనర్ ఇరిగేషన్ శాఖ క్యాషియర్ నరేష్ పట్నాయిక్



విజిలెన్సు అధికారులకు చిక్కిన ఎంఐ డివిజన్ శాఖ అకౌంటెంట్ సూరజ్ ప్రసాద్ జైస్వాల్

చెట్టును ఢీకొని ఒకరి మృతి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి ప్రధాన రహదారిలోని నందాగూడ సమీపంలో గురువారం ఉదయం ఓ యువకుడు బైక్‌పై అతివేగంగా వచ్చి చెట్టును ఢీకొట్టాడు. కలిమెల సమితి గినిపల్లి గ్రామానికి చెందిన ఇర్మా మాడ్కమి (23) బుధవారం తన బంధువు కుమార్ గూడ గ్రామానికి వెళ్లాడు. అక్కడ నుంచి గురువారం ఉదయం కలిమెల తిరిగి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు క్షతగాత్రుడిని పోడియా ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ విషయం తెలిసిన ఇర్మా తండ్రి గంగా మాడ్కమికి పోడియా ఆరోగ్య కేంద్రానికి చేరుకున్నారు. పోడియా పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఆరోగ్య కేంద్రానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని తెలిపారు .



ప్రమాద స్థలంలో పడి ఉన్న ఇర్మా మాడ్కమి

క్లుప్తంగా

కొరియా సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలి



- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీశంకరరావు

విజయనగరం అర్బన్: సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కొఠియా గ్రామాల వివాదాన్ని పరిష్కంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీశంకరరావు కోరారు. ఇటు ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌డీఏ కూటమి అధికారంలో ఉండడం, అటు ఒడిశా బీజేపీ పాలిత రాష్ట్రంగా ఉన్న నేపథ్యంలో కొఠియా గ్రామ సమస్య పరిష్కరానికి ఇదే తగిన సమయమని డాక్టర్ శంకరరావు పేర్కొన్నారు. గతంలో సుప్రీంకోర్టు కూడా ఈ సమస్యకు రాజకీయ, పరిపాలనా పరమైన పరిష్కారాలు చూడాల్సిన అవసరం ఉందని చెప్పిందని సూచించారు. ఆయా గ్రామాల ప్రజాభిప్రాయానికి విలువనిస్తూ వారి సంక్షేమం, అభివృద్ధికి ఆటంకం కలగకుండా సమస్య పరిష్కరించాల్సి ఉందన్నారు. ఈ మేరకు కేంద్ర గిరిజన శాఖకు, రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీ ఎస్టీ కమిషన్ లేఖ రాసినట్లు తెలిపారు. కొఠియా సమస్య పరిష్కారానికి కేంద్రం సారథ్యంలో కమిటీ వేయాలని ఆంధ్ర, ఒడిశా ప్రభుత్వాలు కొఠియా గ్రామాల సమస్య పరిష్కారానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు.

ఈవీఎం గొడౌన్ల తనిఖీ



ఈవీఎం గోదామును తనిఖీ చేస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

నెల్లిమర్ల: స్థానిక ఈవీఎం గొడౌన్లను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురువారం తనిఖీ చేశారు. గోదాములకు వేసిన సీళ్లను, తాళాలను పరిశీలించి సెక్యూరిటీపై సమీక్షించారు.అప్రమత్తంగా ఉండాలని అధికారులు, పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఇన్‌చార్జ్ ఆర్డీఓ టి.సవరమ్మ, తహసీల్దార్ రవిశంకర్, కలెక్టరేట్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ శేఖర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితి పొడిగింపు

విజయనగరం అర్బన్: రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు మరో మూడు నెలల పాటు పొడిగిస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకుడు హిమాన్షు శుక్ల గురువారం ఉత్తర్వులు జారీచేశారని జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి తెలిపారు. ఉత్తర్వుల మేరకు 2025 జూన్ 1 నుంచి 2025 ఆగస్టు 31 వరకు పొడిగింపు వర్తిస్తుందన్నారు.

జూదరుల అరెస్ట్



పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని గొర్లిపేటలో పేకాట శిబిరంపై పోలీసులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. గ్రామంలోని ఓ ఇంట్లో కొంతమంది పేకాట ఆడుతున్నారన్న విషయం తెలుసుకున్న పోలీసులు..ఎస్‌ఐ గణేష్ ఆధ్వర్యంలో అక్కడికి చేరుకుని, ముగ్గురు జూదరులను పట్టుకుని అరెస్ట్ చేశారు. అనంతరం వారి వద్ద నుంచి రూ.15 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా తమకు సమాచారం ఇవ్వాలని, విషయం తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసులు గ్రామస్తులకు తెలిపారు.

వాహనం కండిషన్ చెక్ చేసుకోవాలి



104 వాహనం కండిషన్ తనిఖీ చేస్తున్న జిల్లా మేనేజర్ విలియమ్ చంద్

విజయనగరం ఫోర్ట్: ప్రతిరోజూ 104 వాహనాల కండిషన్ చెక్ చేసుకోవాలని 104 జిల్లా మేనేజర్ విలియమ్ చంద్ సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చెల్లూరులో 104 వాహనం ద్వారా గురువారం వైద్యసేవలు అందజేశారు. అక్కడికి వచ్చిన ఆయన వాహనం తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. వాహనం ఎలా నడుస్తోంది.. బాగుందా లేదా అనే విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేటాయించిన గ్రామానికి ఉదయం 9 గంటలకే చేరుకుని, ప్రజలకు వైద్యసేవలు అందజేయాలని కోరారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు.

నిరంతరం నిఘా ఉంచాలి

నెల్లిమర్ల: గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పర్యవేక్షణకు నిరంతరం నిఘా ఉంచాలని ఎస్‌ఐ బి.గణేష్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సచివాలయ మహిళా పోలీసులతో గురువారం సమావేశమైన ఆయన.. ఎక్కడైనా చిన్నచిన్న గొడవలు జరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలని, ఆ గొడవలు పెద్దవి అవ్వకు ముందే మేల్కొంటే సమస్య త్వరగా పరిష్కారమయ్యేందుకు వీలుంటుందన్నారు.

శిథిలావస్థలో కుష్ఠు ఆస్పత్రి

- భయాందోళనలో రోగులు
- వసతిలేక ఇబ్బందులు



వసతులులేని పాగిరి లెప్రసీ ఆస్పత్రి

రాజాం: ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో చాలామందికి పాగిరి లెప్రసీ ఆస్పత్రి పేరు తెలిసే ఉంటుంది. విశాఖపట్నం పరిధిలో కేవలం మూడుచోట్ల మాత్రమే స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో లెప్రసీ నిర్మూలన ఆస్పత్రులు ఉండేవి. అందులో పాగిరిలో ఒకటి నిర్మించి, సేవలు ప్రారంభించారు. 1962లో ఎంతో అట్టహాసంగా నాలుగు భవనాలతో లెప్రసీ ఆస్పత్రి ఇక్కడ ప్రారంభమైంది. అప్పటినుంచి ఇప్పటివరకూ అవే భవనాల్లో ఇక్కడ రోగులకు సేవలు అందిస్తున్నారు. స్థలాలు, నిధులు ఉన్నా పక్కా భవనాల నిర్మాణం ఇక్కడ లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం దు.

పట్టించుకునేవారేరీ?

రాష్ట్రప్రభుత్వం ప్రజారోగ్యంపై దృష్టిసారించడం లేదు. కుష్ఠు నిర్మూలన కార్యక్రమాల ప్రారంభం అట్టహాసమే తప్ప వచ్చి తమ రోగాన్ని నిర్మూలించుకోవాలనుకునేవారికి కనీస వసతులు కల్పించలేకపోతున్నారు. రాజాంతో పాటు రేగిడి, వంగర, సంతకవిటి, జి.సిగడాం, పొందూరు, తెర్లాం తదితర ప్రాంతాల్లోని రోగులకు పాగిరి లెప్రసీ ఆస్పత్రి ఆసరాగా ఉంటుంది. ప్రతి నెలా సగటున 20 నుంచి 28 మంది రోగులు ఇక్కడికి వచ్చి ఉంటున్నారు. వ్యాధి తగ్గినవారు ఇంటికి వెళ్లిపోతుండగా, కొత్తవారు వచ్చి నయం చేసుకుంటున్నారు. వారికి కనీసం ఇక్కడ భోజనం పెట్టే సదుపాయాన్ని కూడా ప్రభుత్వం కల్పించలేదు. రాజాంకు చెందిన పారిశ్రామికవేత్త జీఎంఆర్ ఆర్థిక సాయంతో పాటు కొంతమంది దాతలు అప్పుడప్పుడు ఇక్కడికి వచ్చి ఆర్థికసాయాన్ని అందిస్తున్నారు. తాగునీటి సమస్యతో పాటు వసతి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, కనీసం దుప్పట్లు, రగ్గులు వంటివి కూడా ఇక్కడ పంపిణీ లేదని పలువురు బాధితులు వాపోతున్నారు.

భోజన సదుపాయం లేదు

మేం చిన్నచిన్న కుష్ఠు వ్యాధి లక్షణాలతో ఇక్కడ చేరాం. ప్రస్తుతం వ్యాధి తగ్గుముఖం పడుతోంది. ఇంటి వద్ద కుటుంబసభ్యులు వచ్చేయమన్నారు. కానీ మరికొద్ది రోజులు ఉండి వెళ్లాలని అనుకుంటున్నాను. ఇక్కడ సరైన భవనాలు లేవు. దోమలు. విష సర్పాల బెడద ఉంటుంది. భోజనాలు దాతలు సమకూర్చు తున్నారు.

కె.రాంబాబు, కుష్ఠువ్యాధి బాధితుడు

కొత్త వాటి పంపిణీలేదు

ఇక్కడ ఆస్పత్రిలో ఎప్పటివో పాతకాలంనాటి దుప్పట్లు, బెడ్‌షీట్లు ఉన్నాయి. సరైన వస్తుసామగ్రి లేదు. కొత్తవి పంపిణీ చేయడంలేదు. దాతలు ఇచ్చిన రగ్గులు, దుప్పట్లు తప్ప కొత్తవి ప్రభుత్వం నుంచి సరఫరాలేదు.

పి.లక్ష్మణరావు, కుష్ఠువ్యాధి బాధితుడు

చినుకుపడితే చిత్తడే

ఎప్పుడో 62 సంవత్సరాల క్రితం నిర్మించిన రేకులు, పెంకుల భవనాలే ఇప్పటికీ ఆస్పత్రి భవనాలుగా ఉన్నాయి. వాటి రేకులు శిథిలమై నీరు కారుతోంది. ఎండాకాలంలో నేరుగా ఎండ లోపలకు వచ్చేస్తుంది. విషసర్పాలు, దోమలు నేరుగా భవనాల్లోకి వస్తున్నాయి. చలికాలం, వర్షాకాలంలో ఇక్కడ రక్షణలేని పరిస్థితి కనిపిస్తోంది. కిటికీల తలుపులు, ప్రధాన ద్వారబంధాల తలుపులు మొత్తం ఊడిపోయాయి. వాటికి స్థానిక వైద్యులు సొంత డబ్బులతో మరమ్మతులు జరిపిస్తున్నారు. రాజాంకు చెందిన జీఎంఆర్ వీఎఫ్ చిన్నచిన్న మరమ్మతులకు ఆర్థికసాయం అందిస్తోంది. కొత్తగా ఇక్కడ భవనాలు అవసరమున్నప్పటికీ రోగుల సంఖ్య తగ్గడంతో పెద్దగా దృష్టిసారించలేదు.



ఆస్పత్రిలో పాత మంచాలు, బెడ్‌షీట్లు



శిథిల భవనంలో చికిత్స పొందుతున్న రోగులు



కేంద్రం ప్రారంభంనాటి రేకుల షెడ్డు

జిల్లాలో బాలకార్మికులు పనిచేయకుండా చూడాలి

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో బాలకార్మికులు పనిచేయకుండా చూడాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. జూన్ 2 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా బాలకార్మికుల పునరావాసం కోసం ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. అందుకోసం జిల్లా స్థాయి. డివిజనల్ స్థాయిలో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ సభ్యులు జిల్లా అంతటా ఒకే సమయంలో దాడులు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన తన చాంబర్‌లో జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందు ప్రమాదకరమైన సంస్థలు, స్థలాల్లో పనిచేస్తున్న బాల కార్మికులను రెండు రోజుల్లోగా గుర్తించాలని సూచించారు. ఎక్కడైనా బాల కార్మికులను గుర్తిస్తే వెంటనే పనిచేయించే యాజమానిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని స్పష్టం చేశారు. నెలరోజుల పాటు జిల్లా అంతటా టాస్క్ ఫోర్స్ కమిటీలు ఒకే సమయంలో దాడులు జరపాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్ఓ మురళి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ప్రసాదరావు, ఐసీడీఎస్ పీడీ రుక్సానా బేగం, జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ హిమబిందు, డీసీపీయూ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పట్ల గిరిజనులకు అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డా. ఎ.కృష్ణప్రసాద్

పార్వతీపురంటౌన్: గిరిజనులకు వారి హక్కులు, బాధ్యతల పట్ల అవగాహన కలిగి ఉండాలని విజయనగరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డా. ఎ. కృష్ణప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పలు పథకాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. నాగరిక సమాజానికి దూరంగా ఉంటున్న గిరిజనులకు రాజ్యాంగం ద్వారా ప్రత్యేక హక్కులు కల్పించినట్లు తెలిపారు. గిరిజన హక్కులు పరిరక్షించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు.

సబ్‌జైల్ ఆకస్మిక తనిఖీ

పార్వతీపురం సబ్ జైలును గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో ఖైదీలతో ముఖాముఖి మాట్లాడి వసతులు పరిశీలించారు. నాణ్యమైన ఆహారం అందుతోందా? లేదా? అని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలని జైలు సిబ్బందిని ఆదేశించారు. అనంతరం జైలు రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.సౌమ్య జోస్పిన్, డీఆర్‌డీఏ ఏపీడీ సత్యంనాయుడు, లోక్ అదాలత్ సభ్యులు టి.జోగారావు, ఎంఎల్ఎస్సీ సిబ్బంది కె. సునీత, జి.గంగాదేవి, పారాలీగల్ వలంటీర్లు, గిరిజనులు పాల్గొన్నారు.

69 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

- రూ.6.90 లక్షల జరిమానా వసూలు



డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: విజయనగరం పోలీసులు గురువారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో రూ.6.90 లక్షల జరిమానా వసూలు చేశారు. మొత్తం 69 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో బాధ్యులను కోర్టులో ప్రవేశపెట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానాను విజయనగరం అడిషనల్ జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ చక్రవర్తి విధించారని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురవుతారని ఎస్పీ ఈ సందర్భంగా చెప్పారు. అలాగే వాహనాలను ఢీ కొట్టి పలు ప్రమాదాలకు కారకులవుతున్నారన్నారు. ఈ తరహా బైక్ రైడ్స్‌ను కట్టడి చేసి, ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేకించి విజువల్ పోలీసింగ్ చేపడుతున్నామన్నారు. విజువల్ పోలీసింగ్‌లో ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను తమ సిబ్బంది చేపడుతున్నారని ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు.

రైలు కింద పడి ఒడిశా వాసి మృతి

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం రైల్వే గేట్ సమీపంలో రైలు కింద పడి గురువారం ఉదయం ఒడిశా వాసి మృతి చెందినట్లు బొబ్బిలి రైల్వే కానిస్టేబుల్ ఈశ్వరరావు తెలిపారు. ఒడిశాలోని కలహండి జిల్లా జమున్ బహల్ తాలూకా, దాదాపూర్ గ్రామానికి చెందిన జవహర్‌లాల్ బిశ్వాల్(45)ను వైజాగ్ నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న రైలు ఢీకొనడంతో మృతి చెందినట్లు చెప్పారు. దీనిపై మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని విజయనగరం సర్వజన ఆస్పత్రిలో ఉంచినట్లు తెలిపారు.

బడ్డీకొట్టు మాయం..!

- పేదవ్యాపారి కొట్టును లేపేసిన బడావ్యాపారి
- పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు
- నాన్చుడు ధోరణిలో పోలీసులు



బడ్డీకొట్టు మాయమైన ప్రాంతం



రోడ్డున పడిన చిరువ్యాపారి ప్రసాద్



రంగప్పచెరువులోపడేసిన బడ్డీకొట్టు

రాజాం: ఓ పేద వ్యాపారి బడ్డీకొట్టుపై బడావ్యాపారి కన్నుపడింది. అంతే..అదే తడవుగా అధికార పార్టీ నాయకులను ఆశ్రయించి రాత్రికి రాత్రే చెక్క బడ్డీని అపహరించి, చెరువులో పడవేంచాడు ఆ బడా వ్యాపారి. ఈ తంతు జరిగిన వెంటనే బాధితుడు రాజాం పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేసి నాలుగురోజులు గడిచినా బాధితుడికి న్యాయం జరగలేదు. కేవలం అధికార పార్టీ ఒత్తిళ్లతోనే తనకు అన్యాయం జరుగుతోందని బాధితుడు వాపోతున్నాడు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. రాజాం పట్టణంలోని మాధవబజార్‌లో ప్రభుత్వ పాఠశాల ఎదురుగా పట్టణానికి చెందిన వడ్డి ప్రసాద్ అనే చిరువ్యాపారి గత 30 సంవత్సరాలుగా చెక్క బడ్డీ కొట్టులో ఉల్లిపాయలు, చింతపండు, కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారీ వ్యాపారంపై వస్తున్న ఆదాయంతో తనతో పాటు భార్యను పోషిస్తూ వస్తున్నాడు. ఈయన బడ్డీకొట్టు వెనుకల బండి లక్ష్మీనారాయణకు చెందిన కిరాణా వ్యాపారికి చెందిన పక్కా షాపు ఉంది. ఆ షాపుకు ఈ చిన్న బడ్డీ కొట్టు అడ్డుగా ఉండడంతో వారిద్దరి మధ్య కొంతకాలంగా వివాదాలు వస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత లక్ష్మీనారాయణ వేధింపులు ఎక్కువయ్యాయి. తన బడ్డీ కొట్టు లీజుకు తీసుకున్న దస్తావేజులు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉండడంతో ప్రసాద్ ఎవరికీ లొంగలేదు. తన వ్యాపారం తాను చేసుకుంటూ కాలంనెట్టుకొస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 25 న అర్ధరాత్రి సమయంలో ప్రసాద్‌కు చెందిన బడ్డీ మాయమైంది. మరుసటిరోజు ఉదయం వ్యాపారం చేసేందుకు వచ్చిన ప్రసాద్ తన బడ్డీ అక్కడ లేకపోవడంతో ఉలిక్కిపడ్డాడు. తన బడ్డీకొట్టు ఎవరో దొంగిలించారని తొలుత ఆందోళన చెందాడు. అనంతరం శ్యాంపురం రోడ్డులో రంగప్ప చెరువులో బడ్డీకొట్టు పడేసి ఉండడంతో తనతో వివాదాలకు దిగుతున్న వారే ఈ పనిచేసిఉంటారని బాధితుడు అనుమానం వ్యక్తంచేస్తూ తన బడ్డీకొట్టు వెనుక ఉన్న వ్యాపారిపై రాజాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు.

నాలుగు రోజులైనా జరగని న్యాయం

తన వద్ద అన్నిరకాల డాక్యుమెంట్లు ఉన్నాయని, తన బడ్డీని దొంగిలించినవారిపై చర్యలు తీసుకోవడంతో పాటు అందులో రూ.1 లక్షకుపైగా ఉన్న సరుకులకు డబ్బులు ఇప్పించాలని పోలీసులను కోరాడు. ఈ తంతు జరిగిన నాలుగురోజులు గడిచినా ఇంతవరకూ ప్రసాద్‌కు న్యాయం జరగలేదు. తాను చిరువ్యాపారిని కావడంతోనే తనకు ఎవరూ మద్దతుగా రావడంలేదని, న్యాయం జరగడంలేదని ప్రసాద్ విలేకరుల ఎదుటవాపోతున్నాడు. బండి లక్ష్మీనారాయణ అనే బడా వ్యాపారే కొంతమంది అధికార పార్టీ నేతల మద్దతుతో బలవంతంగా తన బడ్డీ కొట్టూ తొలగించాడని ఆరోపిస్తున్నాడు. పోలీసులు సైతం తనకు న్యాయం చేయడంలేదని లబోదిబోమంటున్నాడు. ఇదిలా ఉండగా ఈ విషయంపై రాజాం పట్టణ సీఐ అశోక్‌కుమార్ వద్ద సాక్షి ప్రస్తావించగా, బాధితుడి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, న్యాయం చేస్తామన్నారు.

యోగాతో జీవనాడులు ఉత్తేజం

- డీఎంహెచ్ఓ భాస్కర రావు



యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా ఎస్.భాస్కరరావు

పార్వతీపురం టౌన్: యోగాసనాలతో మానవ జీవనాడులు ఉత్తేజమవుతాయని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.ఎస్.భాస్కరరావు అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక వైద్యారోగ్య కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బందికి యోగాసనాలపై యోగా గురువు మోహన్ శిక్షణ ఇచ్చారు. ప్రాణాయామంతో పాటు వివిధ భంగిమల యోగాసనాలను వేయించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ యోగాసనాలు అలవర్చుకునే విధంగా యోగా గురువుతో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత రోజుల్లో మానసిక ప్రశాంతత, పని ఒత్తిడిని జయించేందుకు యోగా సాధన ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. అలాగే స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని కురుపాం, పాలకొండ, సాలూరులలో యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీ టి.కనక దుర్గ, జిల్లా ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డా. టి.జగన్నాథ రావు, ఐసీడీఎస్ పీఓలు బి.శ్రీనివాసరావు, జి. సుగుణ కుమారి, ఎస్.సుక్కా తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతోనే బాలల వికాసం



విజేతలకు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

విజయనగరం: గ్రంథాలయాలు బాలల వికాసానికి తోడ్పడతాయని విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాల్యం నుంచే పుస్తక పఠనం అలవాటు చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ మాట్లాడుతూ ప్రతి పంచాయతీ స్థాయిలోనూ విద్యార్థులకు అందుబాటులో గ్రంథాలయం ఉండాలన్నారు. పిల్లలను కూర్చోబెట్టి పైకి వినిపించేలా పుస్తక పఠనం చేయిస్తే భాషా ఉచ్చారణ, పఠన సామర్థ్యం కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయని ఈ విషయంపై తల్లిదండ్రులు తప్పనిసరిగా శ్రద్ధ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఆసక్తిగా పాల్గొని భారతదేశ చరిత్రతో పాటు, జిల్లా స్థాయి అంశాలపైన విద్యార్థులు ఎంతో హుషారుగా సమాధానాలు చెప్పారు. విజేతలకు పుస్తకాలను, పతకాలను అందజేశారు. కార్యక్రమంలో మేకా అనంతలక్ష్మి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు అనంతలక్ష్మి, ఏపీ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ కార్యదర్శి సుభద్రా దేవి, మహిళా విభాగం అధ్యక్షురాలు పిన్నింటి కళావతి, సంఘం సలహాదారు కంచర్ల రాజేశ్వరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టవర్లు పూర్తి చేయాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో అసంపూర్తిగా ఉన్న మొబైల్ టవర్ల పనులను తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. మొబైల్ టవర్లు, గృహ నిర్మాణం పట్టాలపై గురువారం స్థానిక కలెక్టరేట్‌లో సంబంధింత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొబైల్ టవర్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, జిల్లాలో ఇంకా 16 మొబైల్ టవర్ల నిర్మాణం పూర్తి కావాల్సి ఉందన్నారు. గుమలక్ష్మీపురం మండలం వడబాయి, కొమరాడ మండలం ఊటకోసు, వనబడి, సాలూరు మండలం సూరపాడు, చోర గ్రామాల వద్ద రహదారుల నిర్మాణానికి పరిపాలన అనుమతులు జారీ చేశామని వాటిని త్వరితగతిన పూర్తి చేసి మొబైల్ టవర్ల నిర్మాణం వేగవతం కావడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పనులు ఆలస్యం చేస్తూ బాధ్యతారాహితంగా పని చేస్తున్న వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. బత్తిలి, కొమరాడ మండలం ఉలికేసు, బదిలీటీనకు, సాలూరు మండలంలోని భద్ర పనులకు తక్షణమే అంచనాలు సమర్పించాలని ఆదేశించారు. అటవీ ప్రాంతంలో ఇప్పటికే నిర్మాణంలో ఉన్న గృహాలకు అటవీ అనుమతులు జారీచేసేందుకు నిబంధనలు పరిశీలించాలని అటవీ అనుమతుల జిల్లా స్థాయి కమిటీతో ఇందులో భాగంగా చర్చించామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ, సీతంపేట ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ కె. హేమలత, డ్వామాపీడీ కె. రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

గురుదేవాలో చోరీపై ముమ్మరంగా దర్యాప్తు



ట్రస్టు కార్యాలయంలో సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్న ఎస్.కోట సీఐ నారాయణమూర్తి

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామంలో గల గురుదేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఇంట్లో భారీ చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఈ చోరీ మంగళవారం రాత్రి జరిగినపటికీ పోలీసులు ఎవరికీ తెలియకుండా గోప్యంగా ఉంచారు.ఎట్టకేలకు బుధవారం రాత్రి 11 గంటలకు బాధితుడు రాపర్తి జగదీష్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ సీహెచ్.షణ్ముఖరావు కేసు నమోదు చేశారు. ఈ చోరీలో కేవలం 90 తులాల బంగారం (కేజీ బంగారం)తో పాటు రూ.5లక్షల నగదు పోయినట్లు కేసు నమోదు చేశారు. వాస్తవానికి మూడు కేజీలకు పైగా బంగారం, రూ 20లక్షల నగదు దోచుకుపోయారని ట్రస్టు నిర్వాహకుడు చెబుతున్నారు. జగదీష్‌బాబు ఇంట్లో గల పూజ గదిలో ఆయన తాత ముత్తాతల నుంచి రాజరాజేశ్వరి శక్తి పీఠం ఏర్పాటు చేసుకుని వంశపార్యపరంగా పూజలను నిర్వహిస్తూ వస్తున్నారు. నాటి నుంచి అమ్మవారికి సంబంధించిన ఆభరణాలు వంశపార్యపరంగా వస్తున్నట్లు బాధితుడు జగదీష్‌బాబు తెలిపారు. అమ్మవారి అలంకరణలో గల బంగారు పాదాలు, వడ్డాణం,దండ కడియాలు, 108 కాసుల హారం, కొబ్బరిపువ్వులను పోలిన బంగారు గొలుసులతో పాటు అతి పురాతన రాజరాజేశ్వర ఉత్సవ విగ్రహాన్ని దోచుకుపోయినట్లు బాధితుడు తెలిపారు. ఈ ఆభరణాలు సుమారు మూడు కేజీలకు పైగానే ఉంటాయన్నారు. ఇవే కాకుండా తన తల్లి, అక్కకు సంబంధించిన బంగారు ఆభరణాలు, రూ.10 లక్షల నగదు చోరీకి గురైనట్లు తెలిపారు. చోరీకి గురైన బంగారు సామగ్రిపై జగదీష్‌బాబు పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ కేసు నమోదు విషయంలో పోలీసులు వెనకంజు వేశారు. బుధవారం రాత్రి 11 గంటల వరకు కేసు నమోదు చేయలేదు. కేసు నమోదు చేసిన పిమ్మటే దర్యాప్తు ప్రారంభించారు. కొత్తవలస, ఎస్.కోట సీఐలు షణ్ముఖరావు, వర్రి నారాయణమూర్తిల ఆధ్వర్యంలో ఎల్.కోట, కొత్తవలస, వేపాడ, ఎస్.కోట ఎస్సైలు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే విజయనగరం నుంచి ప్రత్యేక క్లూస్‌టీమ్ వచ్చి ఘటనా స్థలంలో వేలిముద్రలను సేకరించింది.

రెక్కీ తరువాతే చోరీ

తమ ఇంట్లో జరిగిన చోరీ అప్పటికప్పుడు చేసింది కాదని రెండు మూడు రోజుల పాటు రెక్కీ నిర్వహించి చోరీ చేసినట్లు బాధితుడు జగదీష్‌బాబు తెలిపారు.

31న జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం

పార్వతీపురంటౌన్: జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఈ నెల 31న కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు జరుగుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా విజిలెన్స్ మానిటరింట్ కమిటీ సమావేశంలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల(అత్యాచారాల నివారణ) చట్టం, 1989, నియమాలు, 1995 సమీక్షకు హాజరు కావడానికి కావాల్సిన సమాచారం మొత్తం నివేదిక రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ నూతన సభ్యులను ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు బొబ్బిలి క్రీడాకారులు



విద్యార్థులను అభినందిస్తున్న సీఐ తదితరులు

బొబ్బిలి: పట్టణానికి చెందిన తైక్వాండో క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ సుధాకర్ యాదవ్ తెలిపారు. స్థానికంగా శిక్షణ పొందిన 17 మంది ప్రతిభ గల క్రీడాకారులను ఒడిశా అసోసియేషన్ ఎంపిక చేసినట్లు చెప్పారు. వారు ఈనెల 30 నుంచి మూడు రోజుల పాటు కటక్‌లోని జవహర్‌లాల్ ఇండోర్ స్టేడియంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని తెలిపారు. జాతీయ స్థాయిలో తలపడుతున్న బొబ్బిలి క్రీడాకారులు గెలుపొంది పతకాలతో తిరిగి రావాలని సీఐ కె.సతీష్ కుమార్, అభ్యుదయ పాఠశాలల ప్రిన్సిపాల్ డాక్టర్ చింత శారదలు వారికి గురువారం బెస్టాఫ్ లక్ చెప్పారు.